# 32,334 మంది రైతులు..

రూ. 37,50,54750 పంట నష్టం

నర్సంపేటలో చెక్కులు పంపిణీ చేసిన కలెక్టర్, ఎమ్మెల్యే



8లో

వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 66 సోమవారం | 04 సెప్టెంబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5




# వామ్మో..వాన

## జంకుతున్న నగర ప్రజలు

- వాతావరణ శాఖ హెచ్చరికలతో ఆందోళన
- దిద్దుబాటు చర్యలు చేపట్టని బల్దియా
- మళ్లీ పొంచి ఉన్న వరద ముంపు
- కంటి మీద కునుకులేని గ్రేటర్ జనం
- పునరావాస కేంద్రాలకే పరిమితమవుతున్న వరంగల్ మహా నగర పాలక సంస్థ



వివరాలు 2లో..

భారీ వర్షాలంటూ వాతావరణ శాఖ హెచ్చరికలు నగర ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. వర్షం అంటేనే వరంగల్ నగర ప్రజలు జంకుతున్నారు. కంటి మీద కునుకు లేని రాత్రులు గడుపుతున్నారు. ఏ ప్రాంతాన్ని వర్షపు నీరు ముంచెత్తుతుందోనన్న ఆందోళన ప్రతి ఒక్కరిలో నెలకొంది. ముందుచూపు లేని బల్దియా పాలకవర్గంతోనే ముంపు తప్పడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైల్వే శాఖ అధికారులు నూతనంగా వేస్తున్న మూడో లైన్ తో అండర్ రైల్వే గేటు ప్రాంతానికి ముప్పు పొంచి ఉన్నప్పటికీ చేష్టలుడిగిన పాలకవర్గం మిన్నకుండడంపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బొందివాగు నాలా నుంచి పెద్ద ఎత్తున వచ్చే వరద నీరు భద్రకాళి చెరువులోకి చేరేలా కట్టకు కనీసం ఏడెనిమిది రేన్ ఫాల్ షట్టర్స్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు తుంగలో తొక్కడంకూడా ముంపుకు కారణంగా మారుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- వరంగల్ వాయిస్, వరంగల్



8లో

# యాదాద్రికి దీటుగా..

వల్మిడి సీతారామచంద్ర స్వామి ఆలయం అభివృద్ధి చేసేందుకు చర్యలు

రాష్ట్ర ఆర్థిక , వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు

చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా శ్రీ సీతారామాంజనేయ విగ్రహాల ప్రతిష్టాపన



8లో

## ఎమ్మెల్యే టికెట్‌కు గంట రవి దరఖాస్తు

తూర్పు నుంచి అవకాశం ఇవ్వాలని వినతి



## కమల దరహాసుడు “కొండేటి శ్రీధర్ ”

వర్ధన్నపేటలో పాగా వేసేందుకు బీజేపీ స్కెచ్

సమర్థత కలిగిన లోకల్ నేతగా గుర్తింపు

గెలుపే లక్ష్యంగా అడుగులు

పార్టీ బలోపేతానికి కృషి

ప్రత్యేక కథనం 7లో..



## జంకుతున్న నగర ప్రజలు

- వాతావరణ శాఖ హెచ్చరికలతో ఆందోళన
- దిద్దుబాటు చర్యలు చేపట్టని బల్దియా
- మళ్లీ పొంచి ఉన్న వరద ముప్పు
- కంటి మీద కునుకులేని గ్రేటర్ జనం
- పునరావాస కేంద్రాలకే పరిమితమవుతున్న వరంగల్ మహా నగర పాలక సంస్థ

# వామ్మో వాన!

**వరంగల్ వాయిస్, వరంగల్ :** అల్పపీడన ప్రభావంతో వచ్చే మూడు రోజులపాటు పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని, అదే విధంగా ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, భూపాలపల్లి, ములుగు, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో భారీ వానలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో వరంగల్ మహా నగర పాలక సంస్థ పరిధిలోని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలు వరంగల్ నగరాన్ని అతలా కుతలం చేయగా వాటి జ్ఞాపకాలు ఇప్పటికీ కళ్లముందే కదలాడుతున్నాయి. ఆరోజులు మరువకముందే మళ్లీ భారీ వర్షాలంటూ వాతావరణ శాఖ చేసిన హెచ్చరికలు నగర ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.

### మూడో లైనే ముంచిందా..

అభివృద్ధిలో భాగంగా రైల్వే శాఖ మూడో లైన్ పనులను ముమ్మరం చేసింది. అందులో భాగంగా గతంలో ఉన్న రైల్వే లైన్ కట్టను ఆనుకొని మూడో లైన్ పనులు జరుగుతున్నాయి. అయితే ఇక్కడే సమస్య తలెత్తుతోంది. గతంలో వరంగల్ నుంచి దర్గా కాజీపేట వరకు రైల్వే లైన్ కింద నీరు అటూ ఇటూ సాఫీగా ప్రయాణించేలా పది నుంచి పన్నెండు వరకు చిన్న, పెద్ద మోరీలు ఉండేవి. ముంపు సంభవించకుండా ముందు చూపుతో ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన చిన్నా, చితక మోరీలన్నింటినీ మూడో లైన్ పేరుతో మూసివేశారు. దీంతో బొంది వాగు నాలాతోపాటు అండర్ రైల్వే గేటు ప్రాంతంలోని చుట్టు పక్కల ప్రాంతాలనుంచి పెద్ద ఎత్తున వచ్చే వరద నీరు రైల్వే ట్రాక్ దాటి బయటికి ప్రవహించే మార్గంలేక ఈ ప్రాంతాన్ని ముంచెత్తుతోంది. ఈ విషయం బల్దియా పాలకవర్గానికి, అధికారులకు తెలిసినా రైల్వే అధికారులతో మాట మాత్రమైనా చర్చించకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే చినుకు పడిన ప్రతి సారీ అండర్ రైల్వే గేటు ప్రాంతం ముంపుకు గురికావాల్సిందేనని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### ఒకే షట్టర్ వరదలను ఆపేనా..

కాకతీయ రాజులు గొలుసు కట్టు పద్ధతిలో నిర్మించిన చెరువుల్లో భద్రకాళి చెరువు ఒకటి. గతంలో అండర్ రైల్వే గేటు ప్రాంతంలోని పలు చెరువుల మత్తడి నీటితోపాటు ఇదే ప్రాంతంలోని వరద నీరు నేరుగా భద్రకాళి చెరువులో కలిసేది. అయితే భద్రకాళి చెరువును సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ గా మార్చిన తర్వాత భద్రకాళి చెరువు చుట్టూ బండ్ నిర్మాణం చేపట్టారు. ఇదే సమయంలో ముంపును గుర్తించిన సీనియర్ ఇంజినీర్లు బండ్ పొడవునా ఏడునుంచి ఎనిమిది వరకు రేన్ ఫాల్ షట్టర్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. వీరి మాటలను ఏ మాత్రం పట్టించుకోని బల్దియా పాలకవర్గం కేవలం ఒకే ఒక రేన్ ఫాల్ షట్టర్ ను ఏర్పాటు చేశారు. దీంతో భారీ వర్షాలు కురిసిన సమయంలో పెద్ద ఎత్తున వచ్చే వరద నీరు ప్రవహించేందుకు మార్గం లేకపోవడంతో ఆ నీరు హంటర్ రోడ్డును ముంచెత్తుతోంది. ప్రతి ఏడు ఇదే పునరావృతం అవుతున్నా ఇవేమీ పట్టించుకోని బల్దియా పాలకవర్గం కమిషన్లకు ఆశపడి అభివృద్ధి పేరుతో అడ్డంగా దోచుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా బల్దియా అధికారులు మొద్దు నిద్ర వీడి ముంపుకు గల కారణాలను మరోమారు సమీక్షించి ప్రజలను ముంపు నుంచి కాపాడాలని కోరుతున్నారు.

### రాష్ట్రంలో భారీ వర్షాలు..

మంగళ, బుధ వారాల్లో నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలకు అతిభారీ వర్ష సూచన ఉన్నదని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో ఆయా జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్ జారీ చేసింది. సోమవారం ఉదయం నుంచే రాష్ట్ర వ్యాప్తంగా జోరుగా వర్షం కురుస్తోంది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వీటికితోడు ఎగువ ప్రాంతాల నుంచి వరద వస్తుండటంతో ప్రాజెక్టుల్లో నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భూపాలపల్లిలో ఆదివారం నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తోంది. దీంతో సింగరేణి ఓపెన్‌కాస్ట్ కు చెందిన 2,3 గనుల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. బంగాళాఖాతంలో ఆదివారం ఏర్పడిన ఆవర్తన ప్రభావంతో వచ్చే 48 గంటల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని వాతావరణశాఖ తెలిపింది. అల్పపీడన ప్రభావంతో వచ్చే మూడు రోజులపాటు పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని హైదరాబాద్ వాతావరణశాఖ తెలిపింది.





## "అక్షర శిల్పి"

ఆదిగురువు అమ్మ అయితే వేలు పట్టి నడిపించి
లోకాన్ని పరిచయం చేసే గురువు నాన్న.
తల్లిదండ్రులు జన్మనిస్తే గురువులు జీవితాన్నిస్తారు.
బుడిబుడి నడకల పసిప్రాయంలో, ఏమీ రాయని నల్లబల్ల లాగా..
మట్టి ముద్ద లాగా చిన్నారి చిట్టి విద్యార్థి బడిలోకి ప్రవేశిస్తే,
అమ్మలా, సరస్వతమ్మలా.. ముద్దు మురిపాలతో ముచ్చటగా..
తన ఒడిలో అక్షరాభ్యాసం చేయించి, కర్త, కర్మ, క్రియలు.. అన్ని గురువై..
సృష్టి స్థితి లయ కారకులుగా..
కమ్మరిగా ,కుమ్మరిగా, వడ్రంగిగా, శిల్పిగా..
అందమైన ఆకృతులను తీర్చిదిద్దే.. త్రిమూర్తి స్వరూపమైన గురువు..
విద్యార్థి యొక్క అజ్ఞానాంధకారాన్ని తొలగించి,
విజ్ఞాన జ్యోతులు వెలిగించే.. అక్షర సూరీడు గురువు!
మట్టిలోని రాయిని వెలికితీసి వజ్రంలా సాన బట్టి సాగనంపేది గురువు!
సుద్దముక్క హలంతో..విద్యా క్షేత్రాన్ని దున్ని..
అక్షర బీజాలను మొలకెత్తించి.... విజ్ఞానకుసుమాలను పూయించే..
హాలికుడు, తోటమాలి.. గురువు!
దేశ దేశాధినేతల అయినా ఎంతటి విజ్ఞానవంతులు అయినా..
గురువు చేతిలోని శిల్పాలే.. విలువలతో కూడిన విద్యనందించి, విద్యార్థి
శిలను.. దండన, పొగడ్త, నిందలనేఉలితో చెక్కి..
విజ్ఞాన సౌరభాలను వెదజల్లే.. కళాత్మక శిల్పాలను చెక్కే శిల్పకారుడు..
అక్షర శిల్పి.. గురువు!
సమాజంలో.ఏ.. ప్రతిఫలాపేక్ష లేని.. ఏకైక నిస్వార్థజీవి.. గురువు!
తన విద్యార్థి ఎదిగితే.. తాను ఎవరెస్ట్ ఎక్కినంత..
ఆనంద శిఖరాలను అధిరోహించేది. గురువు!
కరిగే కొవ్వొత్తి.. జ్ఞాన దివిటీ
నిస్వార్థ జీవి.. అల్పసంతోషి.. విజ్ఞానపు గని
గురు బ్రహ్మ.. త్రిమూర్తి స్వరూపుడైన గురువుకి వందనం.
జ్ఞాన దాతల చరణ ధూళికి వందనం అభివందనం.
శిరస్సు వంచి నా గురువులకు పాదాభివందనం



**సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా.. ఉపాధ్యాయులకు ఈ .. నా..చిరు కవిత.. అంకితం**

పేరు: **తిరునగరి పద్మ ,**
తెలుగు పండిట్, MPUPS
నేరేడుపల్లి, భూపాల పల్లి, హన్మకొండ
**కలం పేరు:-స్ఫూర్తి**

# రజకుల సంక్షేమమే ధ్యేయం

## ల్యాండ్రోమార్ట్ ప్రారంభానికి సిద్ధం చేయండి

### మేయర్ గుండు సుధారాణి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రజకుల సంక్షేమమే ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్యేయమని అందులో భాగంగానే మాడ్రన్ ధోబి ఘాట్లు నిర్మిస్తున్నట్లు నగర మేయర్ గుండు సుధారాణి పేర్కొన్నారు. సోమవారం మేయర్ గ్రేటర్ వరంగల్ లోని 11వ డివిజన్ పోతన నగర్ లో కొనసాగుతున్న ల్యాండ్రోమార్ట్ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయుటకు అధికారులకు పలు సూచనలు చేశారు. సీఎం కేసీఆర్ ఆలోచన, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ దిశా నిర్దేశం మేరకు ఇక్కడ ఏర్పాటు చేస్తున్న ప్రతి రోజు 36 వేల బట్టలు ఉతికే సామర్థ్యం గల ల్యాండ్రోమార్ట్ దేశంలోనే మొట్టమొదటిదన్నారు. ఈ ల్యాండ్రో మార్ట్ లో 9 వాషింగ్ మిషన్లు 9 డ్రైయర్లు, బట్టలను ఇస్త్రీ చేయుటకు పరికరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 100 మంది రజకులకు దీని ద్వారా ప్రత్యక్షంగా ఉపాధి కలుగుతుందన్నారు. గంటకు 4,500 చొప్పున 8 గంటలకు 36,000 దుస్తులను ఈ లాండ్రో మార్ట్ లో ఉతకవచ్చని వివరించారు. రూ. 3 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న లాండ్రోమార్ట్ పనుల్లో మిషనరీ ఇన్స్టాలేషన్, సివిల్ వర్క్, ఎలక్ట్రికల్ పనులు పూర్తయ్యాయని, ఇంకను మిగిలి ఉన్న ఫర్నీషింగ్ పనులు త్వరితంగా పూర్తి చేయాలని, ముంపునకు గురి కాకుండా వెనుక భాగంలో ఉన్న నాలాకు రిటైనింగ్ వాల్ ఎత్తు పెంచాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. చుట్టుప్రక్కల అలంకృత మొక్కలతో మధ్యలో యూకలిప్టస్ మొక్కలు నాటి సుందరీకరణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ అనిస్ ఉర్ రషీద్, ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర, సీఎం హెచ్ ఓ, డాక్టర్ రాజేష్ ఈ ఈ లు రాజయ్య, సంజయ్ కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ తూర్పు నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సమీక్ష సమావేశం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు అధ్యక్షతన హరిత హోటల్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ పార్లమెంట్ ఇంచార్జి రవీంద్ర ఉత్తమ్ రావు దళ్వి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కొండా మురళీధర్ రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను దోపిడీలను భరించలేకే కాంగ్రెస్ పార్టీ ద్వారానే పేదలు బాగుపడతారని విశ్వసించి కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ జోరులో ఉందని అధికారంలోకి రావడం ఖాయమైందన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధిని పక్కదోవ పట్టించి ప్రజలకు మాయ మాటలు చెప్పి ప్రలోభాలకు గురి చేస్తున్నారన్నారు. ప్రజలు బీఆర్ఎస్ చేస్తున్న అరాచకాలను నిశితంగా గమనిస్తున్నారని, ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధమవుతున్నారన్నారన్నారు. కేసీఆర్ కు ఎన్నికలు వచ్చినప్పుడే పథకాలు గుర్తుకు వస్తాయని, 9ఏళ్లు ఫామ్ హౌస్ లో నిద్రపోయి ఎన్నికలు రాగానే హడావిడి చేసి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. రాబోయే ఎన్నికలలో వరంగల్ తూర్పు నియోజకవర్గం లో గెలిచేది కాంగ్రెస్ పార్టీయే అని అన్నారు. గతంలో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి అంటే కేవలం కొండా సురేఖ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మాత్రమే అని కొండా మురళీధర్ రావు పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా (కొండా సురేఖ) పోటీ చేస్తున్నారు. కాబట్టి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై అహర్నిశలు శ్రమించాలన్నారు. మీరు మరింత ఉత్సాహంతో గతంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పథకాలను ఇప్పుడు అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి పార్టీ గెలుపుకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో వరంగల్ తూర్పు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, అన్ని డివిజన్ల అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కొండా అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



**వరంగల్ వాయిస్, మల్హర్ :** నాచారం గ్రామానికి చెందిన సెండి రాజు(45)అనే వ్యక్తి సోమవారం నాచారం సమీపంలోని మల్లన్నగుట్ట పరిసర ప్రాంతంలో అనుమానస్పదంగా మృతిచెందాడు. గ్రామస్తుల సమాచారం మేరకు కొయ్యూరు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని మృతుని వివరాలు సేకరించారు. రాజు ఆత్మహత్య చేసుకున్నాడా లేదా మరేదైనా కారణం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు కొయ్యూరు పోలీసులు తెలిపారు.

## రోడ్డుకు మరమ్మతులు చేయించాలి



**వరంగల్ వాయిస్, కాటారం :** కాటారం నుంచి బస్వాపూర్ వరకు గుంతలమయంగా మారిని జాతీయ రహదారిని బాగుచేయాలని కొత్తపల్లి గ్రామ ప్రజలు స్థానిక హనుమాన్ టెంపుల్ ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ ఈ రహదారి గుండా అడుగడుగున గుంతలే దర్శనమిస్తున్నాయని, దీంతో ప్రతి రోజు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాలతో చాలా మంది ప్రాణాలు కొల్పయారని, కొంత మంది ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని వారి బాధను వెల్లడించారు. ఇసుక లారీలు అధిక లోడుతో వెళ్తున్న సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ ఈ విషయంపై స్పందించి రోడ్డు బాగుచేయించి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరారు. లేనిపక్ లో చుట్టు పక్కల గ్రామాల ప్రజల మద్దతుతో రహదారిని నిర్భంధం చేస్తామని, ఇసుక లారీలను అదుపు చేయాలని సీఐని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి గ్రామ ప్రజా ప్రతినిధులు, పెద్దలు, యువకులు, రైతులు, ఆటో యూనియన్ నాయకులు, ట్రాక్టర్ యూనియన్, వ్యాపారస్తులు, అంకుశాపూర్, ములుగుపల్లి గ్రామానికి సంబంధించిన యువకులు పాల్గొన్నారు.

# మభ్యపెట్టేందుకే బీఆర్ఎస్, బీజేపీల పరస్పర విమర్శలు

### ఆ రెండు పార్టీలను ఎన్నికలలో ఓడించాలి
### 8న అధిక ధరలకు వ్యతిరేకంగా ధర్నాలు
### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కేంద్ర,రాష్ట్రాలలో అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనని, ప్రజలను మభ్యపెట్టేందుకే ఆ రెండు పార్టీల నాయకులు పరస్పరం విమర్శించుకుంటున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం వరంగల్ శివనగర్ లోని సీపీఐ జిల్లా కార్యాలయం తమ్మెర భవన్ లో పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం దండు లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు అంతర్గతంగా సహకరించుకుంటాయని, పరస్పర ప్రయోజనాలను కాపాడుకుంటాయని అన్నారు. రాష్ట్రంలో బీజేపీకి ఎవరూ ఓటు వేసే పరిస్థితి లేదని గ్రహించే బీజేపీని రక్షించే పనిని మోడీ ఆదేశాలతో కేసీఆర్ చేపట్టారని తెలిపారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలు కలిసే పనిచేస్తాయని, ఆ పార్టీల భాగస్వామ్యం రాష్ట్రానికి, దేశానికి ప్రమాదకరం అని అన్నారు. బీజేపీకి కేసీఆర్ అనుకూలంగా మారడం వల్లనే కమ్యూనిస్టులు దూరం అయ్యారని, అంతర్గతంగా జట్టు కట్టిన ఆ పార్టీలను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని అన్నారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో కేసీఆర్ గడిచిన తొమ్మిదేళ్ళుగా ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తున్నారని, ప్రజలు వారికి గుణపాఠం చెప్పేందుకు సిద్దంగా ఉన్నారని అన్నారు. ఈ నెల 8న అధిక ధరలకు వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా, అన్ని మండల కేంద్రాలలో ధర్నాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ బాష్ మియా, పనాస ప్రసాద్, కార్యవర్గ సభ్యులు అక్కపెల్లి రమేష్, బుస్సా రవీందర్, గన్నారపు రమేష్, తోట చంద్రకళ, గుంపెల్లి మునీశ్వరుడు, వీరగోనిశంకరయ్య, సంగి ఎలేందర్, గుండె బద్రి పాల్గొన్నారు.

## పెంచిన ధరలను తగ్గించాలి



**వరంగల్ వాయిస్, మరిపెడ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన అధిక ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ(ఎం)మండల నాయకులు నందిపాటి వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం అబ్బాయిపాలెం గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించడానికి ఈ నెల 1 నుంచి 7 వరకు అఖిల భారత స్థాయిలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందుగా గ్రామంలో పలు వీధులలో ర్యాలీ నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చి 9 ఏళ్ల పాలనలో ప్రజలు వాడుకునే ప్రతి నిత్యావసర వస్తువుల మీద ధరలు పెంచి పేద ప్రజల జీవితాలను అస్తవ్యస్తం చేశారని విమర్శించారు. 2014లో బీజేపీ అధికారంలోకి రాకముందు గ్యాస్ ధర రూ.400 ఉండగా, ఇప్పుడు రూ.1200లకు పెరిగిందన్నారు. కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వ పాలనలో పేదలను దోచి కార్పొరేట్ శక్తులకు పెడుతున్నారని విమర్శించారు. వెంటనే అధిక ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జినక ఎర్ర ఎంకన్న, కొండ ఉప్పలయ్య, జినక సైదులు, జామ్మూర్తి, కొండయ్య, వెంకన్న, పులమ్మ, ఉప్పలమ్మ, మాధవి, వెంకన్న ఉన్నారు.

## యువజన కాంగ్రెస్ సెక్రటరీగా పర్నెం అరుణ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా యువజన కాంగ్రెస్ సెక్రటరీగా పర్నెం అరుణ్ రెడ్డిని నియమిస్తూ సోమవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా ఆర్డర్ కాపీని అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అరుణ్ రెడ్డి మాట్లాడుతూ నా నియామకానికి సహకరించిన తెలంగాణ స్టేట్ అధ్యక్షుడు శివసేన రెడ్డికి, నేషనల్ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ సాగరికరావు రమాకాంత్ రెడ్డికి యువజన కాంగ్రెస్ వరంగల్ ఇంచార్జి సాయి కృష్ణా రెడ్డికి, హనుమకొండ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేపల్లె రంగనాథ్ కు హనుమకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అలవాల కార్తీక్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ వైస్ ప్రెసిడెంట్ తోట పవన్ కు ఈ నియామకానికి సహకరించిన అందరికీ కూడా కృతజ్ఞతలు తెలియజేస్తూ యువజన కాంగ్రెస్ బలోపేతానికి పనిచేస్తూ ఓసైనికులులాగా పనిచేసి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూ యువజన కాంగ్రెస్‌ను కూడా గ్రామీణ స్థాయిలో పని చేస్తానన్నారు. అలాగే జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిపించుటకు యూత్ కాంగ్రెస్ పాత్ర పోషిస్తానని అన్నారు.

# కాంగ్రెస్ పార్టీ పరకాల అభ్యర్థిగా సోల్తి కిరణ్ గౌడ్‌ను ప్రకటించాలి

### ఆరేగంటి నాగరాజు గౌడ్



**వరంగల్ వాయిస్, కేయూ :** కాంగ్రెస్ పార్టీ పరకాల అభ్యర్థిగా సోల్తి కిరణ్ గౌడ్ ను ప్రకటించాలని రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడు తెలంగాణ ఆల్ యూనివర్సిటీ ఇంచార్జి ఆరేగంటి నాగరాజు గౌడ్ డిమాండ్ చేశారు. నాగరాజు మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు వద్ద తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేక మంది కాకతీయ యూనివర్సిటీ ఉద్యమకారులు ఉద్యమాన్ని చేశారని గుర్తు చేశారు. నేడు సీఎం కేసీఆర్ కాకతీయ యూనివర్సిటీని మరిచిపోయి విద్యార్థి ఉద్యమకారులకు మొండి చేయి చూపించారని విమర్శించారు. ఉద్యమకారులకు ఎలాంటి పదవులు ఇవ్వకుండా ఉద్యమకారుల పోరాటానికి ఫలితం లేకుండా ఉద్యమకారుల కనీసం గుర్తింపు లేకుండా చేశారని దుయ్యబట్టారు. మరి కాంగ్రెస్ పార్టీ అయినా కాకతీయ యూనివర్సిటీలో ఉద్యమం చేసిన ఉద్యమకారులకే టికెట్ ప్రకటించాలని కోరారు. పరకాల గడ్డలో అత్యధిక మంది బీసీలు ఓటర్లుగా ఉన్నారని, కాబట్టి జనాభా ప్రాతిపదికన ఒక బీసీ ముద్దుబిడ్డ, ఉద్యమకారుడు, ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి ఆల్ యూనివర్సిటీస్ పార్ట్ టైం లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సోల్తి కిరణ్ గౌడ్ కు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వాలని రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే టికెట్టు ప్రకటించాలని డిమాండ్ చేశారు. పరకాల గడ్డలో బీసీలమంతా ఏకమై సోల్తి కిరణ్ గౌడ్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కాంగ్రెస్ పార్టీ పరకాల అభ్యర్థిగా ఒక ఉద్యమకారుడు బీసీ అభ్యర్థి అయినటువంటి సోల్తి కిరణ్ గౌడ్ ని ప్రకటించాలని రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమ నాయకుడు సుధగాని మధు గౌడ్, అన్వేష్, శ్రవణ్, నరేష్, నటరాజ్,శ్రీను, అన్వేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
సోమవారం 04, సెప్టెంబర్ 2023
www.warangalvoice.net

# ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ అసమర్థుడు

**వరంగల్ అభివృద్ధి లేమికి కారణం ఆయనే**
**కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి**
**రవీంద్ర కుమార్ దళ్వి**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాంగ్రెస్ పార్టీ సంకల్ప యాత్రలో భాగంగా సోమవారం ఏఐసీసీ అబ్జర్వర్, వరంగల్ పార్లమెంట్ ఇంచార్జి రవీంద్ర కుమార్ దళ్వి వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 30వ డివిజన్ లో అంబేద్కర్ విగ్రహం దగ్గర యాత్రను ప్రారంభించారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి పాదయాత్ర అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రారంభమై బాలసముద్రం మార్కెట్, ఏకశిలా పార్క్ రోడ్, బరిస్టా రోడ్, హంటర్ రోడ్, రాజ్ హోటల్, నంది హిల్స్ మీదుగా సాగి దీన్ దయాళ్ నగర్ కాలని వద్ద ముగిసింది. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యంతో హనుమకొండ వాసులకు అభివృద్ధి ఫలాలు అందని ద్రాక్షలా మారాయన్నారు. మధ్యలోనే ఆగిన స్మార్ట్ సిటీ పనులు, అందుబాటులోని రాని నూతన అండర్ డ్రైనేజ్ వ్యవస్థకు కారణం ఆయనే అని దుయ్యబట్టారు. ఏఐసీసీ అబ్జర్వర్, వరంగల్ పార్లమెంట్ ఇంచార్జి రవీంద్ర ఉత్తమ్ రావు దళ్వి మాట్లాడుతూ మోడీ పాలనలో దేశంలో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, పెట్రోల్, గ్యాస్, డీజిల్ రెట్ల పెంపుతో మధ్యతరగతి కుటుంబాల బతుకు భారమైందన్నారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణాలో అభివృద్ధి అంత ఒక కేసిఆర్ కుటుంబానికే పరిమితమైందని, నీళ్ళు, నిధులు, నియమాకాలంటూ అధికారంలోకి వచ్చాక వాటిని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాబోయే రోజుల్లో ఈ రెండు ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు వల్లపు రమేష్, డివిజన్ సీనియర్ నాయకుడు బొంత సారంగం, పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, ఈవీ శ్రీనివాస్ రావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కూచన రవళి, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమాన్, రహీమున్నిసా బేగం, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు మిర్జా అజీజుల్లా బేగ్, బంక సరళ, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, కూర వెంకట్, బొమ్మతి విక్రం, పల్లకొండ సతీష్, గుంటి స్వప్న, సీనియర్ నాయకులు నల్ల సత్యనారాయణ, మహమ్మద్ అంకుష్, ఎంవీ రాజు, తౌటం రవీందర్, తౌటిరెడ్డి రవీందర్ రెడ్డి, దేశిని ఐలయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బంక సంపత్ యాదవ్, అంబేద్కర్ రాజు, అలువాల కార్తీక్, బండారి జనార్ధన్ గౌడ్, పులి రాజు, కే.భారతి, పల్లె రాహుల్ రెడ్డి, దీపక్ రెడ్డి, నాగపురి లలిత్, ఇప్ప శ్రీకాంత్, మహమ్మద్ ముస్తాక్ నేహాళ్, కొంటె సుకన్య, క్రాంతి భరత్, డివిజన్ అధ్యక్షులు, యూత్, ఎన్ఎస్ యూఐ నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

## నేటి సమాజంలో మీడియా పాత్ర కీలకం

**ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన**
**హాజరైన జడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతి, ఐటీడీఏ పీఓ అంకిత్**



**వరంగల్ వాయిస్, ఏటూరునాగారం :** నేటి సమాజంలో మీడియా పాత్ర కీలకమని జడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతి, ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఏటూరునాగారం ప్రెస్ క్లబ్ నూతన భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి బడే నాగజ్యోతి, పీఓ అంకిత్ హాజరై భూమి పూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి సమాచారం చేరవేయడంలో వారి పాత్ర కీలకంగా ఉంటుందని, సకాలంలో సమాచారం ఇవ్వడం వల్ల వరదల సమయంలో అనేక సహాయక చర్యలు చేపట్టామన్నారు. ఐటీడీఏ పథకాలను మరింత ప్రజల్లోకి తీసుకెళ్లాలని, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివద్ధి కార్యక్రమాలు, పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు సహకరించాలన్నారు. అలాగే జర్నలిస్టులకు గృహలక్ష్మి కింద అర్హులైన వారికి ఇల్లు వచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సంధ్యారాణి, సీఐ రాజు, ఎస్సై కష్ణప్రసాద్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, ఎంపీపీ అంతటి విజయ, జడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, పార్టీ మండలాల అధ్యక్షుడు సునీల్‌కుమార్, రఘు, సత్యం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, ఆత్మ చైర్మన్ దుర్గం రమణయ్య, బాదం ప్రవీణ్, కావిరి చిన్నికష్ణ, గుడ్ల దేవేందర్, మల్లారెడ్డి, ఆయూబ్, బాదం ప్రవీణ్, శ్రీనివాస్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అఫ్జల్‌పాషా, ప్రధాన కార్యదర్శి అలువాల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు నూక ప్రభాకర్, గౌరవ సలహాదారుడు సీహెచ్ వెంకన్న, వసంత రమేష్, గోవర్దన్, శేఖర్, బోడ సత్యం, కుదురుపాక రాజేష్, గంపల శివకుమార్, సాయి, రాజు, గోపాల్, వాసు, వసంత రమేష్, వరప్రసాద్, ప్రతాప్, తేజా, గౌరిశంకర్, భిక్షపతి, దామోదర్, నర్సయ్య,తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ చేరికల జోరు



**వరంగల్ వాయిస్, పరకాల :** సీఎం కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసే సంక్షేమ పథకాలు, చేస్తున్న పనులకు యువత ఆకర్షితులవుతున్నారని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. గీసుగొండ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు గులాబీ కండువా కప్పుకున్నారు. వారికి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కండువా కప్పి యువకులకు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నానని అన్నారు. ప్రజా సంక్షేమమే ఎజెండాగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజా సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కలిసికట్టుగా పార్టీ కోసం కృషిచేసి గ్రామాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. తెలంగాణాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు మరి ఏ ఇతర రాష్ట్రాలలో అమలు కావడం లేదన్నారు. దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తుందన్నారు. గ్రామాలల్లో తప్పుడు ప్రచారం చేస్తున్న ప్రతి పక్ష నాయకులను నిలదీయాలన్నారు. ఎండీ షరీఫ్ (గ్రామ మైనార్టీ అధ్యక్షుడు), ఎండీ.ఖాజా మొహిన్ పాషా (మజీద్ కమిటీ కోశాధికారి), ఎండీ.యాకుబ్ పాషా, ఎండీ.జావీద్, ఎండీ.యాకుబ్ పాషాలు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో గీసుగొండ వైస్ ఎంపీపీ రడం భరత్, శ్రవణ్, అనిల్, లెనిల్, కొండం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి దేవాలయానికి శంకుస్థాపన



**వరంగల్ వాయిస్, పరకాల :** దామెర మండలం లాదెల్ల గ్రామంలో శ్రీ పెద్దమ్మ తల్లి అమ్మవారి దేవాలయం శంకుస్థాపన కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్, హనుమకొండ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పెసరు మైపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుక్క శ్రవణ్య అనిల్, ఎంపీపీ కాగితల శంకర్, ఉప సర్పంచ్ మాదాసు కీర్తి, మాజీ సర్పంచులు హింగే శ్రీనివాస్, మాదాసు వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ కానబోయిన రమేష్, గ్రామ వార్డు సభ్యులు, వివిధ కుల పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రేషన్ కార్డులు వెంటనే మంజూరు చేయాలి

**డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నోముల కిషోర్**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నూతన ఆహార భద్రత కార్డులను వెంటనే మంజూరు చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాక్య డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, సౌత్ మండల కార్యదర్శి నోముల కిషోర్ అన్నారు. సోమవారం హనుమకొండ మండల తహశీల్దార్ కార్యాలయం ముందు డీవైఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపి, తహసీల్దార్ కు మెమోరాండం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికి నూతన రేషన్ కార్డులు ఇవ్వలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను దూరం చేస్తుందని మండిపడ్డారు. గృహలక్ష్మీ పథకానికి అర్హతగా రేషన్ కార్డు పెట్టడం వల్ల చాలా మంది అర్హులు, అర్హత కోల్పోయారన్నారు. అలాగే కొత్తగా పెళ్లిళ్లు అయిన వారు వారి కుటుంబం రేషన్ కార్డు నుంచి వారి పేర్ల ను తొలగించుకొని కొత్త కార్డు అప్లికేషన్ కోసం దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి లో ఉన్నారన్నారు. మహిళ సంఘం గ్రూప్ లో ఉండాలన్న, డబుల్ బెడ్ రూమ్ కు, ఆరోగ్య శ్రీ పథకాలకు రేషన్ కార్డు తప్పనిసరి చేయడంతో అర్హులందరూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే నూతన రేషన్ కార్డు దరఖాస్తులను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు అనంతగిరి దేవేందర్, శివరాత్రి కర్నాకర్, సముద్రాల అనిల్, పల్లపు చామంతి, పండగ శివాని, ప్రణయ్, పవన్, శైలజ, ఉమారాణి, తిరుమల, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడిగా సంపత్ రావు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండల కేంద్రమైన తాడిచర్లలోని శ్రీ సాయి వాణి విద్యానికేతన్ కరస్పాండెంట్ వీరమనేని సంపత్ రావు ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. విద్యా రంగంలో ఈయన చేసిన కృషికి గాను ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేయడం జరిగిందని అధికారులు తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమంలో కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం, అవార్డు అందుకోనున్నారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన సంపత్ రావును పలువురు అభినందించారు.

## గుడిసె వాసులకు పట్టాలు అందించాలి




**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** మండలానికి నూతనంగా వచ్చిన తహసీల్దార్ బండి నాగేశ్వర్ రావు ను మర్యాద పూర్వకంగా లెనిన్ నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బోగి సురేష్, గిరిప్రసాద్ నగర్ అభివృద్ధి కమిటి అధ్యక్షుడు ఎండీ ఉల్ఫాత్ లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు తహసీల్దార్ నాగేశ్వర్ రావు దృష్టికి ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా గుడిసె వాసులకు పట్టాలు ఇచ్చేందుకు జీవో 58,59లు తెచ్చి పేదల పట్టాలు ఇచ్చే ప్రయత్నం చేస్తుందని, వాటి అమలుకు దరఖాస్తులు సర్వే పూర్తి స్థాయిలో నిర్వహించి పేదలకు పట్టాలు అందించేందుకు సహకరించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ 2020 జూన్ 2లోపు ప్రభుత్వ స్థలంలో గుడిసె వేసుకొని కరెంట్ మీటర్లు కానీ, మున్సిపల్ ఇంటి పన్ను కానీ, ఉన్న ప్రతి ఒక్కరికి పట్టాలు వచ్చేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో 37వ డివిజన్ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు అభిషేక్ పాల్గొన్నారు

## పులిగిల్లలో గొర్రెల పంపిణీ



**వరంగల్ వాయిస్, నడికూడ :** నడికూడ మండలంలోని పులిగిల్ల గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని శాసన సభ్యుడు చల్లా ధర్మారెడ్డి ఆదేశానుసారం పులిగిల్ల గ్రామ యాదవులకు 12యూనిట్ల గొర్రెలను సర్పంచ్ పాలకుర్తి సదానందం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు ఈశ్వరయ్య, వెటర్నరీ డాక్టర్ వినయ్, వెటర్నరీ అసిస్టెంట్ కసాగాని రవీందర్, వార్డు సభ్యులు దద్దు శ్రీను, బొమ్మనబోయిన తిరుపతి, వంగ సుధాకర్, చేపూరి అశోక్, గ్రామపంచాయతీ కార్యదర్శి నరసింగం పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల11న జరిగే ధర్నా పిలుపులో భాగంగానే సోమవారం హనుమకొండలోని 49, 59, 60, డివిజన్‌లో తెలంగాణ ఎమ్మార్పీఎస్ నాయకులు బోట్ల భిక్షపతి, మున్నంగి రఘు, వేల్పూర్ ధర్మరాజు, సీఐటీయూ నాయకులు టి ఉప్పలయ్య, బరుపట్ల మహేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు వై బాబు, కోస రాజేష్, మున్సిపల్ డివిజన్ లో కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. అనంతరం గ్రీవెన్స్ సెల్‌లో జిల్లా నాయకత్వం కార్మిక సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈనెల11న వరంగల్ కార్పొరేషన్ ముందు జరిగే మహాధర్నాను దృష్టిలో ఉంచుకొని, వెంటనే కార్మికుల సమస్యలు, నగర కమిషనర్ పరిధిలోని సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్మికులకు సంబంధించిన అనేక సమస్యలను ఏసీ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. లేకుంటే మునిసిపల్ కార్మికుల పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలియజేశారు.

## ఈటల రాజేందర్‌కు పెసరు పరామర్శ



**వరంగల్ వాయిస్, పరకాల :** ఈటల రాజేందర్ ప్రయాణిస్తున్న కారు ఆదివారం ప్రమాదానికి గురి కాగా తెలంగాణ ప్రజల ఆశీర్వాదాలే కవచకుండాలై ప్రమాదం నుంచి ఆయన ఎటువంటి గాయాలకు గురికాకుండా బయటపడ్డారని బీజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి అన్నారు. సోమవారం హుజురాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హుజురాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ తెలంగాణ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ తో కలిసి భోజనం చేసి నిన్న రాత్రి జరిగిన ప్రమాదం గురించి అడిగి తెలుసుకొని వారిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండలం అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, మండల ప్రధాన కార్యదర్శి ఉప్పుగల్లు శ్రీకాంత్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి సముద్రాల రవి, తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం పిలుపు మేరకు గ్రేటర్ వరంగల్ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నిరాహార దీక్షలలో బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు పాల్గొని స్వర్ణకారులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా మీడియాతో ప్రదీప్ రావు మాట్లాడుతూ స్వర్ణకారుల జీవితాలను ఆగం చేసి, చేతి వృత్తి లేకుండా చేసిన ఘనత మన ముఖ్యమంత్రి కేసీఆర్ గారిదేనని, స్వర్ణకారుల పేరులో స్వర్ణం ఉంది కానీ, వారికి బతుకుదెరువు లేకుండా చేసింది ఈ రాష్ట్ర ప్రభుత్వమని, పని లేక ఆత్మహత్య చేసుకొని మరణించిన స్వర్ణకారులు ఎంతోమంది ఉన్నారన్నారు. కనీసం వారి చావులు చూసేనా కూడా చలించని ఈ ప్రభుత్వాన్ని చూస్తుంటే అసహ్యం వేస్తుందని విమర్శించారు. ఉపాధి లేక ఆత్మహత్య చేసుకున్న స్వర్ణకారుల కుటుంబాలను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని, పనులు లేక వలస వెళ్లే స్వర్ణకారులకు ఉపాధి మార్గం చూపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్వర్ణకారుల కుటుంబాలకు అండగా భారతీయ జనతా పార్టీ ఎప్పటికీ తోడు ఉంటుందని, వారి సమస్యలు పరిష్కారం అయ్యేదాకా రాష్ట్ర ప్రభుత్వాన్ని వదిలిపెట్టేదే లేదని ఘాటుగా స్పందించారు. ఈ నిరాహార దీక్షలో గ్రేటర్ వరంగల్ స్వర్ణకార సంఘ అధ్యక్షుడు సురోజు రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి కట్టా రాజేందర్, కోశాధికారి ఉప్పుల మోనాచారి, కట్టా ఈశ్వర్ ప్రసాద్, చిట్టిమల రమేష్, సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి

### ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని పరకాల శాసనసభ్యుడు చల్లా ధర్మారెడ్డి అన్నారు. సోమవారం ఆత్మకూరు మండలంలోని పెద్దాపురం గ్రామంలో రూ.80లక్షలతో గ్రామంలో పూర్తిచేసిన సీసీ రోడ్లతో పాటు నూతన గ్రామపంచాయతీ భవనాన్ని, మహిళ కమ్యూనిటీ భవనం నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా చల్లా మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాలు, పట్టణాల రూపురేఖలు మారిపోయాయని, గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం అధిక మొత్తంలో నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. ఇతర పార్టీ నాయకులు కూడా గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. దశలవారీగా అభివృద్ధి పనులను పూర్తి చేసి సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దటానికి కట్టుబడి ఉంటానన్నారు. అభివృద్ధితో పాటు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన అందరికీ దక్కేలా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో తెలంగాణ అన్ని అంశాల్లోనూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉన్నదన్నారు. గత ప్రభుత్వాలు ప్రజలను పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పరిపాలన కొనసాగిస్తున్నారని కొనియాడారు. ప్రజల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే అసత్యపు ప్రచారాలు చేస్తున్న ప్రతిపక్షాలను తగిన శాస్తి ప్రజల చేతుల్లో తప్పదని హెచ్చరించారు. అలాగే సంగెం మండలం చింతలపల్లి గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గ్రామంలో రూ.30లక్షలతో నూతనంగా వేసిన సీసీ రోడ్లు, రూ.10 లక్షలతో నిర్మించిన శ్మశాన వాటిక, పల్లె ప్రకృతివనాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలో అకాల వర్షాలకు పంట నష్టపోయిన 497మంది రైతులకు గాను రూ.45లక్షల 27వేల విలువ చేసే చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. నర్సానగర్ గ్రామంలో రూ.20లక్షలతో నూతనంగా వేసిన సీసీ రోడ్లు, రూ.12.60 లక్షలతో నిర్మించిన శ్మశానవాటిక, పల్లె ప్రకృతివనం, డంపింగ్ యార్డ్ ను ఈ సందర్భంగా ప్రారంభించారు. అనంతరం గ్రామంలో అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సొసైటీ, మార్కెట్, చైర్మన్లు, కమిటీ సభ్యులు, రైతుబంధు కన్వీనర్లు, సభ్యులు, రైతులు, ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా విజ్ఞప్తులను త్వరితగతిన పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రజా విజ్ఞప్తులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీలోని కలెక్టర్ సమావేశ మందిరంలో గ్రీవెన్స్ డే పురస్కరించుకొని ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి పలు విజ్ఞప్తులు స్వీకరించారు. మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామానికి చెందిన మెరుగు కిరణ్ తాను ఎస్సీ కులం నాకు చెందిన దళిత బంధు పథకం వర్తింప చేయడం లేదని అలాగే రెండు పడక గదుల ఇండ్లు, గృహ లక్ష్మి పథకాలు అర్హులకు వర్తింప చేయడం లేదని, అధికారులకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి అందించారు. కేసముద్రం మండలం తిమ్మంపేట గ్రామ పరిధిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని ఉన్నతాధికారులు ఆకస్మిక పర్యవేక్షణ చేసి చర్యలు తీసుకోవాలని పెరుమళ్ల చరణ్ గౌడ్, చందు, తరుణ్ విజ్ఞప్తి చేశారు. సిరోలు మండలం కొత్తూరు సి గ్రామానికి చెందిన మనిశెట్టి వేణు తన దరఖాస్తు అందిస్తూ తమ గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ కు పీఈటీని నియమించాలని కోరారు. గూడూరు మండలం గుండెంగ గ్రామానికి చెందిన బోడ తారమ్మ తన దరఖాస్తు అందిస్తూ కూలీ పనులకు వెళ్లగా తన కుడికాలు విరిగినదని, తనకు ముగ్గురు పిల్లలు ఉన్నారని జీవనోపాధికి ఇబ్బందులు పడుతున్నందున దివ్యాంగురాలు పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా 118 దరఖాస్తుల స్వీకరణ అనంతరం అదనపు కలెక్టర్ డేవిడ్ అధికారులను ఆదేశిస్తూ త్వరితగతిన విజ్ఞప్తులను పరిష్కరించాలన్నారు. ఈ గ్రీవెన్స్ డే లో జడ్పీ సీఈఓ రమాదేవి, డీఆర్డీఓ సన్యాసయ్య, జిల్లా అధికారులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పేదలను మోసం చేస్తున్న చీఫ్ విప్

### కాంగ్రెస్ నేత బక్క జడ్సన్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ నిర్మించి ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పరిసర ప్రాంతాలను కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ సభ్యుడు, ఉమ్మడి రాష్ట్ర మాజీ చైర్మన్ బక్క జడ్సన్ పరిశీలించారు. హనుమకొండ, న్యూ శాయంపేటలో నిర్మించి ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కూడా అధికారులతో యాక్షన్ వేయించుటకు కుట్రలు చేస్తున్నట్లు గతంలో 11మంది తహసీల్దార్లు, ఆర్డీవో అదేవిధంగా ఆనాటి కలెక్టర్ వాకాటి కరుణ పర్యవేక్షణలో పేదలకు పంచడానికి నాడు జాబితాను తయారు చేసి ఉన్నప్పటికీ గత సుమారు ఐదు సంవత్సరాలుగా పేదలకు ఈ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇవ్వకుండా జాప్యం చేస్తూ కుట్రపూరితంగా కుడా అధికారుల ద్వారా యాక్షన్ చేసి ప్రభుత్వం సొమ్ము చేసుకునే విధంగా కుట్ర చేస్తున్నట్లు బక్క జడ్సన్ ఆరోపించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం లో ప్రజలు ఒకసారి స్వర్గీయ దాస్యం ప్రణయ్ భాస్కర్ కు అవకాశం ఇచ్చి ఆ తర్వాత నాలుగు పర్యాయాలు స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ను గెలిపించారు. అభివృద్ధి చేస్తారని నమ్మితే పేద, మధ్యతరగతి, బడుగు, బలహీన వర్గాల ప్రజలను నేడు పట్టించుకోకపోవడం హనుమకొండ, న్యూ శాయంపేట లో నిర్మించి ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను చూస్తే అర్థమవుతుందని బక్క జడ్సన్ అన్నారు. సోమవారం హనుమకొండలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను చూస్తే శిథిలావస్థకు చేరుకొని ఉన్నాయన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో నిర్మించి ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను, కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం ఒకేసారి ప్రారంభిస్తే నాలుగేళ్ల క్రితం ఈ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పూర్తిగా నిర్మాణమై ఉన్నప్పటికీ పేదలకు ఇవ్వలేదన్నారు. త్వరలో కాళోజీ కళాక్షేత్రం ప్రారంభించుటకు రాష్ట్ర మంత్రి కేటీఆర్ రామారావు వస్తున్న సందర్భంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పేదలకు ఇవ్వాలని బక్క జడ్సన్ డిమాండ్ చేశారు.

# టెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** సెప్టెంబర్ 15న జరిగే టెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ డేవిడ్ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీలోని కలెక్టర్ సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్రం నిర్వహించే టెట్-2023 పరీక్షల ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ పరీక్షల సంబంధిత అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ టెట్ పరీక్షలను సమన్వయంతో నిర్వహించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు సంసిద్ధులు కావాలన్నారు. జిల్లాలోని 2 డివిజన్లు తొర్రూరు, మహబూబాబాద్ లలో పరీక్షలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఈ నెల 15న నిర్వహించే టెట్ పరీక్ష లో పేపర్1, పేపర్ 2 ఉంటాయని తెలిపారు. మొదటి పేపర్ ఉదయం 9:30 గంటల నుంచీ మధ్యాహ్నం 12గంటల వరకు జరుగనున్నదని, 17 పరీక్షా కేంద్రాలలో 3845 మంది పరీక్ష రాస్తున్నట్లు తెలిపారు. మధ్యహన్నాం జరిగే పేపర్-2 పరీక్ష 2.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు 15 పరీక్షా కేంద్రాలలో 3242 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. 7087మంది టెట్ పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్షల భద్రత కరకు పోలీసు శాఖ బందోబస్తు ఏర్పాట్లు, ప్రశ్నాపత్రాలకు రెవిన్యూ, విద్యా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పర్యవేక్షణకు అదేశించామన్నారు. పరీక్షల పర్యవేక్షణకు నోడల్ అధికారులను నియమించడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాల నిర్వహణకు విద్యుత్ శాఖ నిరంతరం విద్యుత్ సరఫరా జరిగే విధంగాను, మున్సిపాలిటీ నుండి శానిటేషన్, త్రాగునీటి సరఫరా , మరుగుడ్ల నిర్వహణ ఏర్పాట్లు, పరీక్షా కేంద్రాలలో గాలి, వెలుతురు ఉండే విధంగా లైట్స్, ఫ్యాన్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.వైద్య శాఖ శిబిరాలు ఏర్పాటుచేయాలన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షల నిర్వహణ చేపడతామన్నారు. సెల్ ఫోన్లకు అనుమతి లేదని అలాగే గాజులు, చెవి రింగ్ లు, బూట్లతో పరీక్షా కేంద్రాలకు అనుమతించబోమన్నారు. ఆర్టీసీ అధికారులు పరీక్షా సమయాలను బట్టి బస్సులను నడపాలన్నారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఈ సమన్వయ సమావేశంలో అదనపు ఎస్పీ చెన్నయ్య, ఆర్డీఓ అలివేలు, జిల్లా విద్యా శాఖ అధికారి రామారావు, నోడల్ అధికారులు సూర్యనారాయణ, సుధాకర్, ఆర్టీఓ వెంకన్న,తొర్రూరు మున్సిపల్ కమిషనర్ సరస్వతి, విద్యుత్ శాఖ డీఈ సునీత దేవి, విద్యాశాఖ అధికారులు శ్రీరాములు పాల్గొన్నారు.

# కేసీఆర్ పాలనలో మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు

## ఎమ్మెల్యే అరూరి రమేష్



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** మత్స్యకారుల కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. సోమవారం వర్ధన్నపేట మండలం నల్లబెల్లి చెరువులో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి రూ.4లక్షల 24వేల 400 విలువ గల 2.58 లక్షల ఉచిత చేప పిల్లలను వదిలారు. అనంతరం ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి సంబంధించిన రూ.10లక్షల ప్రొసీడింగ్ కాపీని గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ హయాంలో మత్స్య కార్మికుల కష్టాలు తీరాయని, వారు ఆర్థికంగా ఎదిగాలని, డబ్బులు పెట్టి చేపపిల్లలను పెంచే స్తోమత లేని వారికి వంద శాతం సబ్సిడీతో ఉచితంగా చేప పిల్లలను పంపిణి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమేనని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మత్స్య కార్మికుల కోసం సొసైటీ ఏర్పాటు చేసి హక్కులు కల్పించిన ఏకైక రాష్ట్రం కూడా తెలంగాణ రాష్ట్రమేనని అన్నారు. చేప పిల్లల పెంపకం ద్వారా మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నిండాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ ప్రభుత్వానిది ప్రజా సంక్షేమ పాలన..

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్ గుండ్ల సింగారం గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ సమక్షంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రజా సంక్షేమ పాలనను అందిస్తున్న బీఆర్ఎస్ పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రతీ కార్యకర్తకు పార్టీ అండగా ఉండడమే కాకుండా వారిని కడుపులో పెట్టుకొని కాపాడుకుంటుందని అన్నారు. అందరం కలిసి కట్టుగా పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారు జన్ను కిరణ్, కట్కూరి చందు, గడిపి మహేష్, సుమన్, తరుణ్, శశి, జన్ను కృష్ణ, వేణు, కృష్ణ, శతారాసి ఎల్లమ్మ, గారే కల, ఇసంపల్లి నిర్మల, జన్ను రాజు, లక్ష్మి, చందు వీరితో పాటు పలువురు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చల్లా ధర్మారెడ్డి ఓటమి ఖాయం



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** మండల కేంద్రంలో బీజేపీ మండల కమిటీ అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం ఆధ్వర్యంలో బీజేపీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ విజయచందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ పరకాల నియోజకవర్గంలోని ఆత్మకూరు మండలంలో ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే ధర్మారెడ్డి ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. సంక్షేమ పథకాల ఆశ చూపిస్తూ ఇతర పార్టీల కార్యకర్తలను గుంజుకున్నంత మాత్రాన మీరు ఈ ఎన్నికల్లో గెలిచేది లేదని, ఓడిపోవడం ఖాయమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ గౌడ్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్ రెడ్డి, ఆర్టీఐ జిల్లా కన్వీనర్ ఎదులాపురం శ్రవణ్ కుమార్, ఓబీసీ జిల్లా కార్యదర్శి సముద్రాల రవి, మండల ఉపాధ్యక్షుడు గట్టు వేణు, మండల కార్యదర్శులు రవ్వ శివప్రసాద్, భయ్యా పైడి, ఓబీసీ మండల అధ్యక్షుడు వెలదే సదానందం, వార్డు సభ్యులు రేమిడి స్రవంతి, మల్లారెడ్డి, బూత్ అధ్యక్షులు వజ్ర రవికుమార్, మంగ మల్లికార్జున్, భయ్యా మాలగం, వెంగలదాస్ వెంకటనర్సు, వేముల సురేష్, పొదిల సారయ్య, భయ్యా భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి



**వరంగల్ వాయిస్, కాటారం :** రాష్ట్రంలోని విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్స్ వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు కిషోర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కిషోర్ మాట్లాడుతూ 2019 విద్యా సంవత్సరం నుంచి ఫీజు రీయింబర్ష్ మెంట్ బకాయిలు ఉన్నాయని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజులు చెల్లించాలని విద్యార్థులను యజమాన్యం ఒత్తిడి చేస్తుందని, గత మూడేళ్లుగా ప్రభుత్వ స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లించక పేద విద్యార్థుల చదువులు ఆగిపోయాయి అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు. విద్యార్థుల బకాయిలు చెల్లించని పక్షంలో ఆందోళన తీవ్రతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కార్తీక్ పాల్గొన్నారు.

## కాశీ విశ్వేశ్వరాలయంలో తేనాభిషేకం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ నగరంలోని కాశిబుగ్గ శ్రీ కాశీ విశ్వేశ్వర ఆలయంలో శ్రావణమాసం మూడో సోమవారం సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 4:30 నిమిషాల నుంచే పూజలు ప్రారంభమయ్యాయి. శివుడికి తొమ్మిది కిలోల నెయ్యితో, 18 కిలోల తేనెతో ఘనంగా లింగాభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బయ్య స్వామి, భాషబోయిన పోషాలు , మౌటం శ్రీనివాస్, వెంకన్న, పోలోజు రవీంద్ర చారి, పంచాక్షరయ్య, ముచ్చర్ల ప్రభాకర్, వేముల నాగరాజు, కర్ణకంటి శ్రీనివాస్, కూరపాటి రోజా, వేముల రమాదేవి, సబ్బని మనమ్మ, రాణి, ఆలయ పూజారులు గుండేటి రజనీకాంత్, మార్త దీపక్,మోహన్, కళ్యాణ్,ఆలయ సిబ్బంది అమృత రావు, జయ, లావణ్య, రాణి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే ఆరోగ్యం



**వరంగల్ వాయిస్, మరిపెడ :** పోషకాహారం తీసుకోవడం ద్వారా పిల్లలు, తల్లులు, గర్భవతులు ఆరోగ్యంగా ఉంటారని మరిపెడ ఐసీడీఎస్ సీడీపీఓ శిరీష సూచించారు. సోమవారం మండలంలోని అబ్బాయిపాలెం గ్రామ శివారు పత్తికుంట తండా అంగన్వాడీ కేంద్రంలోని బాలింతలు గర్భిణులకు పోషణ్ మాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ శిరీష హాజరై మాట్లాడారు. గర్భిణీ మహిళలు, బాలింతలు తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. వారికి ప్రభుత్వం ద్వారా పోషక ఆహారాలు గుడ్లు, పప్పు ఆకుకూరలు, పాలు అంగన్వాడీ కేంద్రాల్లో అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. అబ్బాయిపాలెం సెక్టార్ సూపర్ వైజర్ విజయలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు బెస్త సంపూర్ణ, కామిండ్ల లక్ష్మీకాంత, మద్దోజ్ కృష్ణకుమారి, ధరావత్ లలిత, అలువాల సత్యవతి, అంగన్వాడీ వర్కర్లు, ఆశా కార్యకర్తలు, గర్భిణి స్త్రీలు బాలింతలు విద్యార్థులు పాల్గొన్నారు.

## పంటలకు జీవం పోసిన వర్షం



**వరంగల్ వాయిస్, మరిపెడ :** ఖరీఫ్ సీజన్ ప్రారంభం లో ముఖం చాటేసిన వర్షాలు .. జూలై నెలలో కుండపోత వర్షం రాగా జనజీవనం స్తంభించి పోయింది. అనేక ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లి వరద ఉధృతి పెరిగినా కానీ, అదే వర్షం ఆగస్టు నెలలో జాడ లేకుండా పోయింది. దీంతో ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండడంతో ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. వ్యవసాయం రంగంలో ఈ ఖరీఫ్ సీజన్ లో నాటిన పత్తి, మొక్కజొన్న, కంది, నువ్వులు, పెసర, వేరుశనగ తదితర పంటలకు సరైన నీరు అందక వాడిపోయి ఎండిపోయే దశకు వచ్చిన తరుణంలో సోమవారం కురిసిన వర్షానికి పునాస పంటలకు పునర్జీవం పోసినట్టు అయిందనీ మండలంలోని పలువురు రైతులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. అంతేగాక వర్షం లేకపోవడంతో పంటలకు చీడపురుగు, పేను బంక, తదితర ప్రభావంతో పంటలు దెబ్బతిన్న పరిస్థితి ఏర్పడిందనీ రైతులు వాపోతున్నారు. ఇప్పటికే మరిపెడ, తాళ్ల ఉకల్, బురహాన్ పురం, తానంచర్ల, నిలుకుర్తి, రాంపురం, ఉల్లేపల్లి తదితర ప్రాంతాలలో మిర్చి, పత్తి పంటకు ఎయిర్ కుళ్లు వైరస్ సోకినట్లు రైతులు తెలిపారు. సరైన వర్షాలు లేకపోవడంతో పంటలపై చీడ పురుగులు వృద్ధి చెందుతున్నాయన్నారు.

# కమల దరహాసుడు కొండేటి శ్రీధర్



చేవ గల నేత.. చేసి చూపగల సమర్ధుడు. ప్రస్తుత రాజకీయాలను తనకు అనుకూలంగా మలుచుకునే చతురత ఉన్న నాయకుడు.. ఎవరెన్ని వ్యూహాలు పన్నినా వాటిని చేధించ గల సత్తా అతని సొంతం. ఆయనే భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే **కొండేటి శ్రీధర్.** రాబోయే ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే అరూరి రమేష్ పై బీజేపీ సంధించిన కమల బాణం ఆయన. వర్ధన్నపేట నియోజకర్గంలో కాషాయపు జెండా ఎగరేయాలనే లక్ష్యంతో పావులు కదుపుతున్నారు. ఈ సారి ఎలాగైనా వర్ధన్నపేట గడ్డపై గెలిచి తీరాలనే కసితో కొండేటి ముందుకెళుతున్నారు.



- గడ్డం కేశవమూర్తి

## వర్ధన్నపేటలో పాగా వేసేందుకు బీజేపీ స్కెచ్

## సమర్ధత కలిగిన లోకల్ నేతగా గుర్తింపు

## గెలుపే లక్ష్యంగా అడుగులు పార్టీ బలోపేతానికి కృషి

**రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు గుర్రాలకే టికెట్లు కేటాయించనుంది. త్వరలో 35మందితో తొలి జాబితాను విడుదల చేయనుంది. అందులో వర్ధన్నపేట (ఎస్సీ)నియోజకవర్గంలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ కు టిక్కెట్ కేటాయించడం ద్వారా సిట్టింగ్ బీఆర్ ఎస్ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ కు చెక్ పెట్టవచ్చని బీజేపీ ఆలోచన చేస్తోంది. వర్ధన్నపేట నియోజకవర్గంలో గెలిచి తీరాలనే లక్ష్యంతో బీజేపీ అభ్యర్థిగా కొండేటిని బరిలో నిలిపేందుకు వ్యూహ రచన చేస్తోంది. త్వరలో ప్రకటించనున్న జాబితాలో ఆయన పేరు పక్కా అని తేలడంలో అతని అనుచరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.**

### గ్రామ వార్డు మెంబర్ నుంచి ఎమ్మెల్యేగా..

కొండేటి శ్రీధర్ వర్ధన్నపేట గ్రామ పంచాయతీ వార్డు మెంబర్ స్థాయి నుంచి తన రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టి అంచెలంచలుగా ఎదిగారు. 1991లో యూత్ కాంగ్రెస్ వర్ధన్నపేట మండల అధ్యక్షుడిగా పనిచేశారు. 1995లో వర్ధన్నపేట గ్రామంలో మొదటిసారి వార్డు సభ్యుడిగా విజయం సాధించి రాజకీయ ఆరంగేట్రం చేశారు. 2001లో వర్ధన్నపేట సర్పంచ్ గా బరిలో దిగి తనకు సాటి లేదని నిరూపించుకున్నారు. ఈ ఎన్నికల్లో 2,453 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాదించారు. అనతరం 2001లోనే వరంగల్ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2003లో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీగా నియమితులయ్యారు. 2004లో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీగా పనిచేశారు. 2006 నుంచి 2009 వరకు వర్ధన్నపేట, పర్వతగిరి బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా సేవలందించారు. 2009లో వర్ధన్నపేట (ఎస్సీ)నియోజకవర్గం ఏర్పడటంతో కాంగ్రెస్ పార్టీ తరపున కొండేటి శ్రీధర్ పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆయన 2009 నుంచి 2014వరకు ఎమ్మెల్యేగా కొనసాగారు. 2010లో ఆంధ్రప్రదేశ్ ఏపీఎల్ఏ ఎస్సీ వెల్ఫేర్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. 2014లో వర్ధన్నపేట అసెంబ్లీ స్థానంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. గెలుపోటములను సమానంగా స్వీకరించే ఆయన నియోజకవర్గంలో తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి పాటుపడ్డారు. 2020లో బీజేపీలో చేరి ఆయన పార్టీ బలోపేతానికి విశేష కృషి చేస్తున్నారు. ప్రస్తుతం బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.



### నియోజకవర్గంలో తనదైన ముద్ర..

2009 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో నియోజకవర్గంలో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, సీఎంఆర్ఎఫ్ సహాయం, పాఠశాల, మండల సమైక్యల భవన నిర్మాణాల కోసం కృషి చేశారు. పంచాయతీ రాజ్ శాఖ కింద రోడ్డు మరమ్మతులు, ఆర్ డబ్ల్యూఎస్ ద్వారా నీటి పైపు లైన్ల నిర్మాణం, నియోజకర్గంలో ఏడు విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణం, ఇరిగేషన్ డిపార్ట్ మెంట్ అభివృద్ధి పనులు, ఐనవోలు దేవాలయ అభివృద్ధి ఇలా నియోజకవర్గంలో రూ.757.34 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేశారు. అంతేకాకుండా ఆయన పదవి ముగిసినా కూడా ఇంకా 190.30 కోట్ల అభివృద్ధి పనులు కొనసాగాయంటే ఆయన పనితనాన్ని అర్థం చేసుకోవచ్చు. కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యేగా గెలిచిన కాలంలో ఆయన చేసిన అభివృద్ధి నేటికీ కనిపిస్తుంది. ఇప్పటి ప్రభుత్వం నియోజవర్గానికి ఏమి చేయలేదని, తాను చేసిన అభివృద్ధే గెలిపిస్తుందని కొండేటి శ్రీధర్ భావిస్తున్నారు. అయితే ఈసారి పోటీ చేసి భారీ మెజార్టీ సాధించి వర్ధన్నపేట గడ్డమీద బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని ఘంటాపథంగా చెబుతున్నారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేసిన పనులతో నియోజకవర్గ ప్రజల గుండెల్లో చెరగని ముద్రను వేసుకున్నానని, ఆ ఫలితమే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిబింభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### బీజేపీ బలోపేతానికి కృషి..

ఆ తర్వాత బీజేపీలో చేరిన కొండేటి శ్రీధర్ 18 మార్చి 2020లో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి జిల్లాలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. జిల్లా, నియోజకవర్గాలో బీజేపీ నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ అన్ని మండలాల్లో బీజేపీ కార్యక్రమాలను విజయవంతంగా ప్రజల్లోకి తీసుకెళుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ అసమర్ధ పాలన ప్రజల ముందు పెట్టి వారి వైఫల్యాలను ఎండగడుతున్నారు. అలాగే బీజేపీ కేంద్ర ప్రభుత్వ పథకాలను గడపగడపకు తీసుకెళుతూ పార్టీ బలోపేతానికి విశేష కృషి చేస్తున్నారు. దీంతో నియోజకవర్గ ప్రజల్లో నిత్యం కనిపిస్తూ వారికి వెన్నుదన్నుగా నిలుస్తున్నారు.

### గెలుపే లక్ష్యంగా అడుగులు..

రాబోవు ఎన్నికల్లో కొండేటి శ్రీధర్ గెలుపే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచిన అనుభవంతోపాటు రెండోసారి పోటీ చేసిన నాటి పరిస్థితులను బేరీజు వేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ తన విజయానికి మెట్లుగా పేర్చుకుంటున్నారు. ఈసారి గెలిచి తన సత్తా చాటేందుకు కొండేటి శ్రీధర్ ఉవ్విళ్లూరుతున్నారు.



### బయోడేటా

పేరు : కొండేటి శ్రీధర్
తల్లిదండ్రులు : ఎల్లమ్మ-వెంకటయ్య
భార్య పేరు : యశోద
పుట్టిన తేదీ : 01-051973
విద్యార్హతలు : ఇంటర్
హొదా : బీజేపీ అధ్యక్షుడు, వరంగల్ జిల్లా (18 మార్చి 2020లో బాధ్యతల స్వీకరణ)
సంతానం : ఇద్దరు కుమారులు,
1. కొండేటి శ్రీకాంత్ -ఏంబీఏ
2. కొండేటి విక్రమ్ - బీటెక్
ఒక కూతురు
1.డాక్టర్ శ్రీషా - ఎంబీబీఎస్









# యాదాద్రికి ధీటుగా..

**వల్మిడి సీతారామచంద్ర స్వామి ఆలయం**

**అభివృద్ధి చేసేందుకు చర్యలు**

**రాష్ట్ర ఆర్థిక , వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు**

**చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా శ్రీ సీతారామాంజనేయ విగ్రహాల ప్రతిష్టాపన**



**వరంగల్ వాయిస్, పాలకుర్తి :** యాదాద్రికి ధీటుగా వల్మిడి సీతారామచంద్ర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు పేర్కొన్నారు. సోమవారం పాలకుర్తి మండలం వల్మిడి గుట్టపై నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో త్రిదండి చిన్న జీయర్ స్వామి వారి మంగళ శాసనములచే శ్రీ సీతారామాంజనేయ విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నేతృత్వంలో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో జరిగిన సీతారాముల విగ్రహాల పునః ప్రతిష్టాపన దేవాలయ పునః ప్రారంభోత్సవ కార్యక్రమానికి త్రిదండి చిన్న జీయార్ స్వామి, రాష్ట్ర మంత్రులు టి.హరీష్ రావు, ఇంద్రకరణ్ రెడ్డి, సత్యవతి రాథోడ్ లు హాజరయ్యారు. వారికి అత్యంత వైభవంగా అర్చకుల వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ పూర్ణకుంభంతో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, జిల్లా కలెక్టర్ శివలింగయ్య ఆహ్వానించారు. ముందుగా త్రిదండి చిన్న జీయార్ స్వామి కొత్తగా నిర్మించిన శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో వేదమంత్రోచ్ఛరణల నడుమ సీతారాముల విగ్రహాన్ని ప్రతిష్టాపన చేశారు. అనంతరం ఆలయ సన్నిధిలో ఇతర విగ్రహాలను, ఆలయ గోపురంపై కలశాన్ని చిన్నజీయర్ స్వామి ప్రతిష్టించారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో పురాతన దేవాలయాల అభివృద్ధితో పాటుగ నూతనంగా నిర్మిస్తున్న దేవాలయాలకు కావాల్సిన నిధులు మంజూరు చేస్తున్నామని గుర్తు చేశారు. దేవాలయాలలో మౌలిక వసతుల కల్పన భక్తులకు అన్ని సౌకర్యాల ఏర్పాటుకు ప్రభుత్వం తగిన కృషి చేస్తోందన్నారు. దేవాలయాల నిర్మాణమే కాకుండా జీర్ణదశలో ఉన్న దేవాలయాలకు ధూపదీప నైవేద్యం కింద ఇప్పటికే ఏడూ వేల దేవాలయాలకు నిధులు చెల్లిస్తున్నామన్నారు. గతంలో ధూపదీపాల కింద ఆరు వేలు ఉండేదని దానిని రూ.10 వేలకు పెంచామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలయాల నిర్మాణం చేస్తూ ప్రజల్లో భక్తిభావాన్ని పెంచుతున్నారన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన ఈ పదేండ్లలో రాష్ట్రంలో ఎటువంటి కరువు కాటకాలు రాలేదని ఆ దేవుడి ఆశీస్సులు కృప రాష్ట్రం, రాష్ట్ర ప్రజలపై ఉందన్నారు. మునుల గుట్టపై రామానుజ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని చిన్న జీయార్ స్వామి కోరగా సమ్మతించిన మంత్రి సీతారామచంద్ర స్వామి కొండ నుంచి మునుల గుట్టను కలుపుతూ వేలాడే వంతెన నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ ఆధ్వర్యంలో పాలకుర్తి అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధిలో పట్టు వదలని విక్రమార్కుడిలా కృషి చేస్తున్నారని కొనియాడారు. అంతేకాకుండా దేశ స్థాయిలో అనేక అవార్డ్స్ తీసుకున్న ఘనత ఆయనకే దక్కుతుందని అత్యధిక అవార్డులు తెచ్చుకున్న మంత్రిత్వశాఖ ఆయనదని పేర్కొన్నారు.

మనుషుల్లో అంతర్లీనమైన ప్రేమ , సహోదర భావం పెంపొందించడానికి, మానసిక ధైర్యం ఇచ్చేందుకు ఆలయాలు అవసరం అని శ్రీ త్రిదండి చిన్న జీయార్ స్వామి తెలిపారు. దైవం విశవ్యాప్తమైనదని మనిషిలో దాగిన దైవాన్ని చూసే సాధనం ఆలయమని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు దయాకర్, కవిత, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, రాజయ్య, రమేష్, జిల్లా కలెక్టర్ శివ లింగయ్య దంపతులు, మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ శశాంక దంపతులు, అడిషనల్ కలెక్టర్ రోహిత్ సింగ్, డీసీపీ, ఎసిపి, కాంట్రాక్టర్ కోడూరు నర్సింహా రెడ్డి దంపతులు, స్థానిక ప్రజాప్రతినిధులు, దేవాలయ ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బ్రమరాంబకు కళా భూషణ్ అవార్డు

**సత్కరించిన మాజీ కుడా చైర్మన్ యాదవ రెడ్డి**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండలోని సుబేదారి ద్వారకా సాయి అపార్ట్మెంట్ లో కూచిపూడి, భరతనాట్యం, జానపద పాటలతో నృత్యాలు నేర్పించి, కొన్ని వేల మంది విద్యార్థులకు ఆదర్శప్రాయులుగా నిలిచిన శ్రీకృష్ణ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ పాఠశాల ప్రిన్సిపల్ భ్రమరాంబకు మదర్ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మోటె చిరంజీవి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కళా భూషణ్ అవార్డును మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి చేతులమీదుగా శాలువాతో సన్మానించి, అందజేశారు. ఈ సందర్భంగా మర్రి యాదవ రెడ్డి మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుంచి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నటువంటి మదర్ ఫౌండేషన్ నిర్వాహకులు చిరంజీవిని అభినందించారు. పలు గిన్నిస్ బుక్ రికార్డులలో అర్హత సాధించినటువంటి ఒక గురువుకు ఈ టీచర్స్ డే సందర్భంగా కళా భూషణ్ అవార్డును అందజేయడంపై ఆనందాన్ని వ్యక్తం చేశారు. మదర్ ఫౌండేషన్ ద్వారా రాబోయే రోజుల్లో మరిన్ని మంచి కార్యక్రమాలు చేయాలని హితవు పలికారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత భ్రమరాంబ మాట్లాడుతూ ఇంతకుముందు ఎన్నో అవార్డులు పొందడం జరిగిందని, ప్రభుత్వ పరంగా కూడా ఎన్నో సత్కారాలు తీసుకున్నానని, శ్రీ తులసి స్వచ్ఛంద సేవా సంస్థ వారి మదర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ అవార్డు రావడం చాలా సంతోషకరమని అన్నారు. ఈ అవార్డు నాలో మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీరజారెడ్డి తో పాటు, భ్రమరాంబకి అవార్డు రావడం పట్ల ఉపాధ్యాయులు, వారి శిష్యులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# 32,334 మంది రైతులు..

## రూ. 37,50,54750 పంట నష్టం



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** మార్చి 2023లో జరిగిన పంట నష్టానికి సంబందించి నర్సంపేట నియోజకవర్గం పరిధఇలోని 32,334 మంది రైతులకు రూ.37,50,54750 మంజూరు అయ్యాయని, ఈ మేరకు సోమవారం వారికి చెక్కులు అందజేసినట్లు వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్యం ప్రకటించారు. సోమవారం నర్సంపేటలోని ఎంఏఆర్ ఫంక్షన్ హాల్ లో స్థానిక శాసన సభ్యుడు పెద్ది సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు పంట నష్టాన్ని రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంతో తయారుచేసిన వ్యవసాయ యంత్రాలను రైతులు వినియోగించుకోవాలన్నారు. దేశవ్యాప్తంగా వచ్చిన వివిధ కంపెనీల ద్వారా కొత్త కొత్త టెక్నాలజీ గల యంత్రాలను వేరే రాష్ట్రాల కంటే తక్కువ ధరలకు అందిస్తున్నామన్నారు. రైతులకు లబ్ది చేకూరే విధంగా ధరల విషయంలో కంపెనీలతో చాలా నేగోషియేట్ చేశామన్నారు. తక్కువ ధరలో నాణ్యమైన యంత్రాలతోపాటు 50 శాతం సబ్సిడీతో అందజేయడం జరుగుతుందని...రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 452 యంత్రాలను రైతులు కొనుగోలు చేసేందుకు వీలుగా అందుబాటులో ఉంచామన్నారు. మొదలు చిన్న రైతులకి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రకటించారు. రైతు వేదిక వద్ద యంత్రాల ధరలు, సబ్సిడీ తెలిసేలా సమాచారాన్ని అందుబాటులో ఉంచుతామన్నారు. ఏవైనా సమాచారం కోసం ఏఓలను సంప్రదించాలన్నారు. గతంలో మాదిరిగా కాకుండా యూబీఐ బౌచర్ పద్దతి ద్వారా రైతు వేదికల్లోనే నగదు, ఫోన్ పే, గుగుల్ పే ద్వారా డబ్బులు చెల్లించి. .బౌచర్ ను దరఖాస్తు ఫారంకు జత చేసి ఏఈఓలకు అందజేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఏదో ఒకటి చేయాలనే ఉద్దేశంతో వ్యవసాయ యాంత్రీకరణ ప్రాజెక్టును నర్సంపేటకు తీసుకువచ్చి ఇటీవల వ్యవసాయ యంత్రాల, పనిముట్ల ఎగ్జిబిషన్ కూడా పెట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయాన్ని పండుగల మన సీఎం కేసీఆర్ మార్చారన్నారు. పంట ఏదైనా నష్టపోయిన ప్రతి ఎకరాకు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. నర్సంపేట, లక్నేపల్లి, మాదన్నపేట, ముత్తోజిపేట, గురిజాల క్లస్టర్ లకు సంబందించి మార్చి 2023 కి గాను 5193 మంది రైతులకి రూ.5,38,46,500 పంట నష్ట పరిహారానికి సంబందించిన చెక్కును జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు, జడ్పీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు, వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ మండల అధ్యక్షులు, క్లస్టర్ల భాధ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే టికెట్‌కు గంట రవి దరఖాస్తు

**బీజేపీ తరపున తూర్పు నుంచి అవకాశం ఇవ్వాలని వినతి**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ తూర్పు నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ యువనేత గంట రవికుమార్ దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం రవి కుమార్ హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమెందర్ రెడ్డి, ఇతర బీజేపీ రాష్ట్ర నాయకులకు తన దరఖాస్తును అందజేశారు. అనంతరం గంట రవి కుమార్ మాట్లాడుతూ రాబోయే సాధారణ ఎన్నికల్లో పార్టీ తనకు పోటీ చేసే అవకాశం ఇస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. నియోకవర్గంలో అధిష్టానం పిలుపుతో ప్రతీ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తూ వస్తున్నట్టు చెప్పారు. నియోజకవర్గంలో బీసీలు ఎక్కువగా ఉన్నందున ఒక బీసీ బిడ్డగా ఒక్కసారి అవకాశం ఇస్తే విజన్, మిషన్ ఉన్న నాయకుడుగా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని స్పష్టం చేశారు. హైదరాబాద్ తర్వాత పెద్ద నగరంగా చెప్పుకోవడమే తప్ప ఇక్కడ జరిగిన అభివృద్ధి శూన్యం అన్నారు. నియోజకవర్గంలోని ప్రజల కష్టాలు ఏంటో తనకు పూర్తిగా తెలుసునని, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నాన్నారు. ఒకసారి అవకాశం ఇస్తే తూర్పును అభివృద్ధి పథంలో నడపడమే కాక ప్రజల కష్టాలను తీరుస్తానని, సమస్యల్ని ఎప్పటికప్పుడు పరిష్కారానికి కృషి చేస్తానని గంట రవికుమార్ తెలిపారు. నగరాన్ని ఎంతో అభివృద్ధి చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం ఇక్కడ ఎలాంటి అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ సిటీ కింద కేంద్రం నిధులు ఇచ్చినా తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ఎక్కడా చేసిన దాఖలాలు లేవని ఆరోపించారు. కనీసం ఇప్పటివరకు కలెక్టరేట్ ఏర్పాటు చేయలేదని, ప్రతి చిన్న పనికి ప్రజలు పక్క జిల్లాకు పరుగులు తీయాల్సిన దుస్థితి వచ్చిందని.. ఇదేనా మీరు చేసిన అభివృద్ధి అంటూ ప్రశ్నించారు. ఇప్పటివరకు కనీసం వరంగల్ బస్టాండ్ నిర్మాణానికి ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని, నగర రోడ్లను విస్తరించలేదని, అస్తవ్యస్త పనులతో ట్రాఫిక్ సమస్యల్ని మరింత పెంచారని ఆరోపించారు. తన సేవా కార్యక్రమాలు కూడా దృష్టిలో పెట్టుకొని అధిష్టానం బీజేపీ నుంచి బరిలో నిలిచే అవకాశం ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# అలేరు అధ్యాపకుడికి ఉత్తమ పురస్కారం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఉన్నత విద్యా శాఖలో పని చేస్తున్న అధ్యాపకులు, ఆచార్యులకు ప్రభుత్వం ఉత్తమ అవార్డులు ప్రకటించింది. అందులో భాగంగా ఆలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య శాస్త్రం అధ్యాపకుడు చిందం సత్యనారాయణ, మహాత్మా గాంధీ యూనివర్సిటీ, నల్గొండ ఉన్నత విద్యా విభాగంలో ఉత్తమ అవార్డుకి ఎంపిక అయ్యారు. సత్యనారాయణ 2011 సంవత్సరం లో ఏపీపీఎస్సీ ద్వారా డిగ్రీ అధ్యాపకుడిగా నియామకం అయ్యారు. మంగళవారం రవీంద్రభారతిలో అవార్డు అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ అవార్డుకి ఎంపిక అయిన సత్యనారాయణకి కళాశాల ప్రిన్సిపాల్ బి.లక్ష్మన్ నాయక్ అధ్యాపకులు జయపాల్, రేవతి, హరిత, రాజు, వెంకటేశం, మల్లేశం, నందకుమార్, విద్యాసాగర్, ముత్యాలు, ఫియాజ్, రమేష్ అభినందనలు తెలిపారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com